సిగ్నల్స్ అందక అవస్థలు

మేడూరులోని బిఎస్ఎన్ఎల్ సెల్‌టవర్

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని లోతుగడ్డ పంచాయతీ మేడూరు గ్రామంలో నెలల క్రితమే బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణం పూర్తయినా, నేటికీ మొబైల్ సిగ్నల్ అందుబాటులోకి తేకపోవడంపై స్థానిక గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

సెల్‌టవర్ నిర్మాణంతో మెరుగైన సిగ్నల్స్‌తో మొబైల్ నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి వస్తాయని ఎంతో ఆనందించిన స్థానిక గిరిజనులకు నేటకీ అసంతృప్తి, నిరాశకు గురిచేస్తోంది. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ కాల్ చేయలేని పరిస్థితి ఉంది. బీఎస్ఎన్ఎల్ అధికారులు దీనిపై దృష్టి పెట్టి, సెల్ సిగ్నల్స్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిబాలల చదువులు గాల్లోకి..

ఏకోపాధ్యాయ పాఠశాలలకు ఇంకా వేసవి సెలవులే!

లిబిడిపుట్టులో పాఠశాల మూతబడడంతో ఆరుబయట ఆటలాడుతున్న గిరిబాలలు

- సిఆర్‌టిల రెన్యువల్‌లో నిర్లక్ష్యం
- నేటికీ మూతబడి ఉన్న బడులు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఐటిడిఎ యాజమాన్యంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు సిఆర్‌టిల నియామకంలో అధికారులు నిర్లక్ష్యం ఇపుడు గిరిబాలల పాలిట శాపంలా మారుతోంది. ఏజెన్సీలోని అనేక ఏకోపాధ్యాయ పాఠశాలలు మూతపడు తున్నాయి. దీంతో తమ బిడ్డల చదువు, భవిష్యత్ ఏంటని గిరిజన తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

కొత్త విద్యా సంవత్సరం పాఠశాలలు పున్న ప్రారంభమై అపుడే నాలుగు రోజులు గడిచింది. అయితే అనేక ఏకోపాధ్యాయ పాఠశాలలకు నేటికీ వేసవి సెలవులు కొనసాగుతున్నాయి. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడం, సిఆర్‌టిలను నియమించకపోవడంతో అవి తెరుచుకోని దుస్థితి నెలకొంది. ఈ మేరకు మండలం లో గాంధ, శీలం గొంది, ముసిరి గొంది గూడ, సిమిలిగూడతో పాటు పలు పాఠశాలలు మూతపడ్డాయి, దీంతో ఆ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న గిరి విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉంది. పాఠశాలలు మూతబడడంతో చదువులు సాగకపోవడంతో గిరిజన విద్యార్థులు నేటికీ ఆటపాటలతోనే కాలంగడిపేస్తున్నారు. బడిలో ఉండాల్సిన పిల్లలు ఇలా బలాదూర్‌గా మారిపోవడానికి ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యమే కారణమని గిరిజన తల్లిదండ్రులు ఆవేదన, ఆక్రోషం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, విద్యాలయాలు తెరుచుకున్నా గిరిజన గ్రామాల్లో ఇంకా మూతబడే ఉన్నాయని వాపోతున్నారు. గతంలో ఏటా విద్యాసంస్థలు పున:ప్రారంభంలోనే సిఆర్‌టిలను రెన్యూవల్ చేసేవారు. అయితే ఈ ఏడాది పాఠశాలలు పున్న ప్రారంభంలో రెవెన్యూవల్ చేయకపోవడంతో ఏకోపాధ్యాయ జిపిఎస్ పాఠశాలలు మూతబడ్డాయి

మూతబడిన గాంధ గ్రామ పాఠశాల

పాఠశాలలు మూతబడకుండా చూడాలి

సిఆర్‌టిలున్న జిపిఎస్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించి పాఠశాలలు మూతపడకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభమై నాలుగు రోజులు గడుస్తున్న ఇప్పటివరకు సిఆర్‌టిలను నియమించకపోవడం దారుణం. విద్యార్థుల చదువులు గాలిపట్టేలా చేస్తున్న అధికారుల నిర్లక్ష్యం వీడాలి. సిఆర్‌టిలను రెన్యువల్ చేసి, మూతబడిన పాఠశాలలను తెరిపించాలి

టి సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు, ఆదివాసీ గిరిజన సంఘం.

రెన్యువల్‌కు 286మంది సిఆర్‌టిల ఎదురుచూపు

. పాడేరు ఐటిడిఏ పరిధిలో జిపిఎస్, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 286 మంది సిఆర్‌టిలు పనిచేస్తున్నారు. వీరంతా మారుమూల గ్రామ పాఠశాలల్లో విధులు చేపడుతున్నారు. సుమారు 10 నుంచి 14 ఏళ్ల వరకు పనిచేస్తున్న వారు ఉన్నారు. ప్రస్తుతం వారిని రెన్యూవల్ చేయకపోవడంతో వీరు పనిచేస్తున్న ఏకోపాధ్యాయ ప్రభుత్వ పాఠశాలలు మూతబడ్డాయి. తక్షణమే ప్రభుత్వం స్పందించి సిఆర్ టి లను రెవెన్యూవల్ చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఐటిడిఎ ఎదుట ధర్నా అనంతరం వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ వర్కర్లు

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని

ఐటిడిఎ ఎదుట అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి-చింతూరు

అంగన్వాడీ కార్యకర్తలకు తల్లికి వందనంతో పాటు అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చింతూరు ఐటీడిఏ ముందు యూనియన్ ఆధ్వర్యాన సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నికల ప్రచార సభల్లో అంగన్వాడీలను ఆదుకుంటామని చెప్పి నేడు సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలకు తల్లికి వందనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు ఎఫ్ఆర్ఎస్ యాప్‌తో నానా అవస్థలు పడుతున్నారని, దాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటిడిఏ ఏపీవోకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు, యూనియన్ జిల్లా అధ్యక్షులు ముసుగు రాజేశ్వరి, సోడి కనక, లలిత, భద్రమ్మ, విజయ, రాములమ్మ పాల్గొన్నారు.

38 మంది ఉపాధ్యాయుల బదిలీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని ఇటీవల జరిగిన బదిలీల ప్రక్రియలో భాగంగా రాజవొమ్మంగి మండలం నుండి 2025 విద్యా సంవత్సరంలో 38 మంది ఉపాధ్యాయులు బదిలీలు అయ్యారని స్థానిక ఎంఈఓ కెవివి సత్యనారాయణ దొర తెలిపారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి రిలీవ్ అయినవారు, తిరిగి జాయినింగ్ తదితర ప్రక్రియను ఎంఈఓ 1, 2 సత్యనారాయణదొర, సూరారెడ్డిలు పర్యవేక్షించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం నుండి ఏలేశ్వరం, అడ్డతీగల ఇతర ప్రాంతాలకు, చింతూరు, విఆర్ పురం, ఎటపాక ఇతర మండలాల నుండి పదిమంది మండలానికి రాగా, ఏడుగురు ఉపాధ్యాయులు ప్రత్యమ్నాయంగా లేక యధావిదంగా అదే పాఠశాలలో కొనసాగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

లేబర్ కోడ్స్ రద్దుకు ఐక్య పోరాటం

- **సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు**

ప్రజాశక్తి -పాడేరు : కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకు కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు సోమవారం పాడేరు మోదకొండమ్మ కల్యాణ మండపంలో సిఐటియు జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. బోనంగి చిన్నయ్య పడాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ,. కార్మికులకు నష్టదాయకమైన నాలుగు కోడ్స్ అమలు జరిగితే పోరాడే హక్కు కోల్పోతారన్నారు. లేబర్ కోడ్స్‌అమలు జరక్కుండా అడ్డుకోవాలని, అవసరమైతే కార్మిక వర్గం ప్రతిఘటించాలని తెలిపారు. పని గంటలు పెంచుతూ రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం కార్పొరేట్లకు, పెట్టుబడిదారుల జేబులు నింపి, కార్మికుల శ్రమ దోపిడి చేసేందుకేనన్నారు. తక్షణ పనిగంటల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాలి మాట్లాడుతూ వచ్చే 9న జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని అందుకు కార్మికులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించకుంటే బానిసలుగా మిగిలిపోతామని హెచ్చరించారు. కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వర్తించేలా తల్లికి వందనం పథక నిబంధనలను సడలించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు. సత్యనారాయణ, భగత్‌రామ్, జనబంధు, కొండలరావు, మోస్యా, ఎల్ సుందరరావ్, ఎపి అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కె.భాగ్యలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి, మంజుల, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పద్మ, మిడ్డే మిల్స్, ఐకెపి నాయకులు మహేష్, జిసిసి, హాస్టల్ వర్కర్స్, ఐటిడిఎ వర్కర్స్, భవన నిర్మాణం కార్మిక సంఘం నాయకులు, విఆర్ఎలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

భూమి పూజ చేస్తున్న మాజీ సర్పంచ్ రాఘవయ్య తదితరులు

కల్వర్టు నిర్మాణ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని లింగాపురం పంచాయతీలో కల్వర్టు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ సోడే శంకర్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ సోడే రాఘవయ్య సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ ఈ కల్వర్టు నిర్మాణం పూర్తయితే రెండు గ్రామాల ప్రజలకు వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా ప్రయాణాలు చేయడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, నాయకులు శేఖర్, రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

18న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశకి- అరకులోయ రూరల్

అరకు నియోజకవర్గం డుంబ్రిగుడ మండలం 33/11 కెవి ఉప విద్యుత్ కేంద్రం పరిధిలోని 11కెవి అరకు, అంజోడ ఫీడర్‌లో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఇతర నిర్వహణ, మరమ్మతు పనుల దృష్ట్యా ఈనెల 18న బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇన్‌ఛార్జి ఇఇ ఎల్ సిహెచ్.పాత్రుడు తెలిపారు. ఈ మేరకు పెదలబుడు, చిన్నలబుడు ,చొంపి, సుంకరమెట్ట, సిరగము, లోతేరు, మాడగడ, మాదాల, బస్కీ, బొండం, గన్నెల, ఇరగాయి, పద్మాపురం, కొత్తభల్లుగూడ, డుంబ్రిగుడ మండలం అరకు పంచాయతీ పరిధి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

తల్లికి వందనం డబ్బుల విత్‌డ్రాకు క్యూ

- ★ లబ్ధిదారులతో కిక్కిరిసిన యూనియన్ బ్యాంకు
- ★ అకౌంట్లు బ్లాక్, ఎన్‌పిసి లింకు కాకపోవడం వంటి సమస్యలతో డబ్బులు జమకాని వైనం

తల్లికి వందనం లబ్ధిదారులతో కిక్కిరిసిన సీలేరు యూనియన్ బ్యాంకు

ప్రజాశక్తి-సీలేరు

రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద విడుదల చేసిన డబ్బులు విత్ డ్రా చేసేందుకు లబ్ధిదారులు జీకే వీధి మండలం సీలేరు యూనియన్ బ్యాంకు వద్ద సోమవారం ఉదయం క్యూ కట్టారు. ఒక్కసారిగా తండోపతండాలుగా రావడంతో యూనియన్ బ్యాంక్ కిక్కిరిసిపోయింది. బ్యాంకు లోపలికి వెళ్లిన లబ్ధిదారుల్ని కట్టడి చేసేందుకు బ్యాంక్ సిబ్బంది నానా అవస్థలకు గురయ్యారు. సీలేరు, దుప్పిలివాడ, దారకొండ, గుమ్మిరేవులు, ఎ.దారకొండ, గాలికొండ పంచాయితీల పరిధిలోని గ్రామాల నుంచి వందల సంఖ్యలో తల్లికి వందనం లబ్ధిదారులు వచ్చారు. దీంతో యూనియన్ బ్యాంక్ లోపల, బయట లబ్ధిదారులు పడిగాపులు కాశారు.

మరోపక్క బ్యాంక్ ఖాతాలో డబ్బులు వేయడం, విత్ డ్రాలు చేయని వారి బ్యాంకు అకౌంట్లు బ్లాక్ అయ్యాయి. మరి కొంతమంది లబ్ధిదారులు బ్యాంకు అకౌంట్లు ఆధార్‌తో పాటు ఎన్‌పిసి లింకు కాకపోవడంతో ఖాతాల్లో తల్లికి వందనం డబ్బులు జమ కాలేదు. దీంతో లబ్ధిదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. జీకే వీధి నుంచి వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయితీ బచ్చులూరు గ్రామం వరకు సీలేరు యూనియన్ బ్యాంకులో ప్రజలు బ్యాంక్ అకౌంట్లు వేల సంఖ్యలో ఉన్నాయి. ప్రస్తుతం 4000 మందికి పైగా బ్యాంకు ఖాతాలు ఉన్న ఖాతాదారుల ఆధార్‌తో ఎన్‌పిసి లింకు కాకపోవడంతో డబ్బులు బ్యాంకు ఖాతాలో జామ కాలేదు. ఈ క్రమంలో బ్యాంకు సిబ్బంది ఎన్‌పిసి కాని వారికి బయోమెట్రిక్ ద్వారా ఆధార్‌కు ఎన్‌పిసి అనుసంధానం చేస్తున్నారు. అన్ని సక్రమంగా ఉన్న అకౌంట్లకు డబ్బులు బ్యాంక్ ఖాతాల నుంచి సిబ్బంది అందజేస్తున్నారు. మరికొంతమంది లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాలో సాంకేతికపరమైన సమస్యలు ఉండడంతో తల్లికి వందనం డబ్బులు పొందడానికి అవకాశం లేకుండా పోయింది. లబ్ధిదారులు ఖాతాలన్నీ సరి చేసేందుకు బ్యాంక్ సిబ్బంది చేత విధాల ప్రయత్నిస్తున్నారు.

బయోమెట్రిక్ ద్వారా డబ్బులు తీసుకుంటే అధిక చార్జీలు

బ్యాంక్ ఎదుట పడికాపులు కాస్తున్న గిరిజనులు

తల్లికి వందనం డబ్బులు బ్యాంక్ అకౌంట్ నుండి ఆధార్ కార్డు ఆధారంగా బయోమెట్రిక్ ద్వారా డబ్బులు తీసుకుంటే అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారు. వెయ్యి రూపాయలకు రూ.20 కమీషన్ తీసుకుంటున్నారని గిరిజన్లో లబోదిబో మంటున్నారు. పక్క రాష్ట్రం ఒరిస్సాలో వెయ్యి రూపాయలకు పది రూపాయలు మాత్రమే తీసుకోగా, సీలేరులో రూ.20 తీసుకోవడంపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధిక ఛార్జీలు వసూలు చేసి దందా చేస్తున్న వారిపై పోలీసులు దృష్టి సారించి కట్టడి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-గంగవరం

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా జూన్ 15 నుండి 30వ తేదీ వరకూ 15 రోజుల పాటు ధర్తి ఆబ జన భగిదరి అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గంగవరం మండలం సుమరాయి గ్రామంలో సోమవారం ఎంపీడీవో లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా 17 సంబంధిత మంత్రిత్వ శాఖల సమన్వయంతో 25 కార్యచరణాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాయం రాజులమ్మ, ఎపిఒ ప్రకాష్, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు తారు రోడ్లు వేయాలి

ప్రజాశక్తి-దేవీపట్నం

ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు (బిటి) తారు రోడ్లు తక్షణమే వేయ్యాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. మన్యంలోని మారుమూల గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. వాగులు, కాలువలు దాటేందుకు బ్రిడ్జిలు లేక ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యా వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ఎండియు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన

నిరసన కార్యక్రమంలో పొద్దు బాలదేవ్, గిరిజనులు

ప్రజాశక్తి- అరకులోయ

ఆదివాసీ ప్రాంతంలో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అరకువేలి మండలం చినలబుడు పంచాయతీ దొరవలస, బొండాం పంచాయితీ జయంతివలస, గన్నెల, పంచాయితీ సిడివలస, బస్కీ పంచాయతీ కంజరితోట, మాదాల పంచాయతీ దాబుగుడ గ్రామాల్లో గిరిజనులు నిరసన చేపట్టారు. అనంతరం అరకులోయ మండల డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎండియులను రద్దుచేసి, డిఆర్ డిపోల వద్ద బియ్యం పంపిణీ ప్రారంభించిందన్నారు. డిఆర్ డిపోల్లో రేషన్ బియ్యం సరఫరా వలన రేషన్ కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 486 డిఆర్ డిపోల పరిధిలో 1,81, 712 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. డిఆర్ డిపోల వద్దకు వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకోవాలంటే అనేక ఆదివాసీ గిరిజన గ్రామాల్లో 3 నుండి 5 కిలోమీటర్లు దూరం కాలినడకన వెళ్లాల్సి వుంటుందని, అదే మారుమూలగ్రామాల విషయానికొస్తే పదికిలోమీటర్లు, ఆపై దూరం కాలినడనక, గుర్రాలపై రేషన్ సరుకులు తెచ్చుకునే వారన్నారు. దీనికోసం రేషన్ బియ్యం తెచ్చుకోవడం కోసమే ఒకరోజు పూర్తిగా కేటాయించాల్సిన దుస్థితి ఉందన్నారు. గతంలో ఎండియు వాహనాల ద్వారా గ్రామాల వరకు రేషన్ సరుకులు వచ్చేవని, దాని ద్వారా ఏజెన్సీ గ్రామాల లబ్ధిదారులకు ఇబ్బందులు ఉండేవి కావన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా గ్రామగ్రామాన రేషన్ బియ్యం పంపిణీ చేయాలని రేషన్ బియ్యంతో పాటు ఇతర సరుకులు కూడా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి జి బుజ్జిబాబు, నాయకులు కె సుబ్బారావు, పరశురాం,రమేష్, బుజ్జిబాబు, అప్పలస్వామి, ముసిరి మల్లన్న, టి.కన్నయ్య, బలరాం, రాజు, సింహాద్రి,సోమన్న, ప్రమీల, లక్ష్మి, అప్పలమ్మ, రాధ, తులవతి పాల్గొన్నారు.

విఆర్.పురం : ఏజెన్సీ ప్రాంతంలో ఎండియుల ద్వారా ఇంటింటికీ బియ్యం, ఇతర రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక డిప్యూటీ తహశీల్దారుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పూనెం ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎండియు ద్వారా రేషన్ పంపిణీ చేసే విధానాన్ని రద్దు చేసిందని, దీంతో మారుమూల ప్రాంత ఆదివాసీలు బియ్యం నిత్యావసర సరుకులు తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. రేషన్ కోసం ఆదివాసీలు 3 నుండి 5 కిలోమీటర్లు వరకు నడిచి వెళ్లాల్సి వస్తోందన్నారు. గతంలో ఎండియు ద్వారా గ్రామ గ్రామాన రేషన్ పంపిణీ వలన మారుమూల ఆదివాసీ ప్రాంత గిరిజనులకు ఎంతో మేలు జరిగేదన్నారు. ప్రభుత్వం తక్షణమే పున:పరిశీలించి తిరిగి పాత పద్ధతి ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో ఎండియు ద్వారా గ్రామాల్లో బియ్యం, నిత్యవసర వస్తువుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, సంఘం నాయకులు సోయం చినబాబు, కారం సుందరయ్య, వేటకాని సూరిబాబు, సారా పాండురాజు, పోడియం శ్రీరామ్మూర్తి, కమ్ముసిచ్చు సత్తిబాబు, వడ్లాది రమేష్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

డిటికి వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘం నేతలు

మాట్లాడుతున్న చిన్నబాబు

ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం వర్తింపజేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు గెమ్మెలి చిన్నబాబు

ప్రజాశక్తి అరకులోయ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం బడికి పంపిస్తున్న ప్రతి ఒక్కరికీ వర్తింపజేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గెమ్మెలి చిన్నబాబు కోరారు. సోమవారం మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ కేంద్రంలోని గ్రామ సచివాలయం వద్ద తల్లికి వందనం అర్హత జాబితా లబ్ధిదారులతో స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు, సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలలో పాఠశాలకు ఎంత మంది పంపిస్తే అంత మందికి ఒక్కొక్కరికి రూ. 15వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని , ఇపుడు అనేక నిబంధనలు పెట్టి కోత పెట్టి అనేక తల్లికి వందనం పథకం దూరం చేయడం తగదన్నారు. ఇది తల్లిదండ్రులకు మోసం చేయడమేనన్నారు. ఈ పథకానికి అనర్హులుగా నెలసరి 300 యూనిట్ల విద్యుత్ వాడకం, 5 ఎకరాలు భూమి, నెలకు రూ.12వేలు జీతం ఇలా కొన్ని నిబంధనలు పెట్టినప్పటికీ, వాటి పరిధిలో లేని వారికి ఉన్నట్లు చూపించి తల్లికి వందనం పథకానికి అనర్హులను చేయడం సరికాదన్నారు. తక్షణం దీనిపై తగు చర్యలు తీసుకుని, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులందరికీ తల్లికి వందనం సాయం అందించాలని కోరారు.

వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపిడిఒ

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -చింతపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అందుతున్న విత్తన సబ్సిడీ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత సూచించారు. సోమవారం చిన్నగెడ్డ సచివాలయంలో ప్రధానమంత్రి జన్మన్ కార్యక్రమంలో భాగంగా గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలను పంపిణీ చేశారు. ఎంపిడిఒ యు.వి.ఎస్. శ్రీనివాసరావు, జనసేన మండల ఉపాధ్యక్షుడు కిముడు కృష్ణమూర్తి (పండు) తదితరులతో కలిసి సర్పంచ్ పుష్పలత విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎంజెఎవై ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు మంజూరు చేయడం ద్వారా గిరిజనులకు అధికారిక గుర్తింపు లభించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలలో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల మరమ్మతులు, ప్రహరీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి కుమార్, పీసా కమిటీ ఉపాధ్యక్షులు రమణ, నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ రేమల చేతన్ వర్మ, కవలం సోమరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

15లోగా హిందీ పరీక్ష ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి- పెదబయలు : దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలలో నిర్వహించు ప్రాథమిక నుండి రాష్ట్ర భాష ప్రవీణ్ హిందీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వచ్చేనెల 15లోగా పరీక్ష ఫీజులు చెల్లించేందుకు అవకాశం ఉందని హిందీ ప్రచారక్ పి.ఫాల్గుణ తెలిపారు. హిందీ పట్ల ఆసక్తి గల విద్యార్థులు 9493531174 మొబైల్ నెంబర్‌కు సంప్రదించాలని ఫాల్గుణ సూచించారు.

బురద రోడ్డులో ప్రయాణమెలా.?

బురదమయమైన రోడ్డు

- వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని బస్కీ పంచాయితీ కొంత్రాయిగూడ, బిజగూడకు వెళ్లే రహదారి బురదమయంగా మారింది .ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్డు అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. దీంతో రెండు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో మొదట్లో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేయడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా తయారైంది. అటవీశాఖ అభ్యంతరం వల్లే కాంట్రాక్టర్ నిర్మాణ పనులను మధ్యలో వదిలేసి వెళ్లిపోయాడనే ఆరోపణలున్నాయి.

ఈ రోడ్డుపై కొంత్రాయిగూడ, బిజగూడ, బస్కీ పంచాయితీకి చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.నిధులు మంజూరైనా, పనులు జరగకపోవడంతో ఆయా గ్రామస్తుల రాకపోకలకు ఇక్కట్లు తప్పడం లేదు.రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా .రోడ్డు రెండు వైపుల మట్టి తవ్వి వదిలేయడంతో తాజాగా కురుస్తున్న వర్షాలకు బురదమయమైంది. వాహనాలు మట్టిలో కూరుకుపోయి ముందుకు కదలని పరిస్థితి నెలకొంది..ఇప్పటికైనా అధికారులు స్పందించి దీనిని మెటల్ రోడ్డుగా మార్చి రవాణా ఇబ్బందులను తొలగించాలని వారు కోరుతున్నారు.

త్వరితగతిన రోడ్డు పూర్తిచేయాలి

మండలంలోని కొంత్రాయిగూడ, బిజగూడ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. ఆరకొర పనులతో రాకపోకలకు జనం ఇక్కట్లు పడుతున్నారు. నిర్మాణపనులకు అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేసిందని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సమస్యను పరిష్కరించి పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలి

సమర్డి బాబూరావు,
ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకుడు.

దాహార్తిని తీర్చండి

ఖాళీ బిందెలతో నీలకంఠ నగర్ వీధి మహిళల నిరసన

నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలోని నీలకంఠ నగర్ వీధిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం వీధిలో నిరసన చేపట్టారు. దీనిపై ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కార చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

నీలకంఠ నగర్ వీధి వాసులంతా ఎనిమిది నెలలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతూ, పిజిఆర్ఎస్‌లోనూ ఫిర్యాదు చేశామని, స్థానిక నేతలు, అధికారుల దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లామంటున్నారు. అయినప్పటికీ ఏ ఒక్కరూ స్పందించడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. పాడేరు జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాల పరిస్థితి ఏంటని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఇపపటికైనా అధికారులు స్పందించి, ఈ వీధిలోని సోలార్ పంపు, నుయ్యి, పంచాయితీ మోటార్ బాగు చేసి మంచినీరు ఇప్పించాలని నీలకంఠ నగర్ వీధి ప్రజలు కోరుతున్నారు. వీధిలో నీటి మోటారులున్న వారి ఇంటికి వెళ్లి, వారిని బతిమలాడుకుని బిందెలతో నీరు తెచ్చుకుని తాగునీరు, ఇతర అవసరాలను తీర్చుకోవాల్సిన దుస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు.

అర్హులకు కేంద్ర పథకాలను అందించడమే లక్ష్యం

మాట్లాడుతున్న ఎంపిడిఒ కుమార్

ప్రజాశక్తి -అనంతగిరి : అర్హులైన వారందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఎవివి.కుమార్ అన్నారు. సోమవారం మండలంలోనిభీంపోలు పంచాయతీ సరియాపల్లి గ్రామంలో జన జాతీయ గౌరవ వర్ష వేడుకల్లో భాగంగా ధర్తీఆబా జన్ భగీదరి అభియాన్ గ్రామసభలు స్థానిక సర్పంచ్ జె.బిమలమ్మ అధ్యక్షతన నిర్వహించరు ఎంపిపి శెట్టి నీలవేణి పాల్గొన్నారు

ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ, ఈ పథకం కింద మండలంలోని 17 గ్రామాలను ఎంపిక చేసి గ్రామ సభలను నిర్వహిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు అవుతున్న 20. పథకాలను అర్హులందరికీ వర్తింపజేసే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరికి ఆధార్‌కార్డు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, పింఛన్లు, గృహాలు తాగునీరు, రహదారి వంటి మౌలిక సదుపాయాలు పిఎం జన్మన్, పీఎం ధన్ మన్, పీఎం కిసాన్ యోజన వంటి పథకాలు అర్హులకు వర్తించేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి శిరగం. అశోక్, స్థానిక నాయకులు పల్లి సింహాచలం, ఈశ్వరరావు కన్నయ్య, వెంకటరమణ, ఎపిఒ అర్జున్, హౌసింగ్ ఏఈ నాగేశ్వరరావు,ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ,పంచాయతీ కార్యదర్శి మహాలక్ష్మి పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

తప్పిన పెను ప్రమాదం

- రక్షణ గోడను ఢీకొట్టిన టిప్పర్

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి మండల పరిధిలో మినీ టిప్పర్‌కు సోమవారం పెను ప్రమాదం తప్పింది. గృహ నిర్మాణానికి అవసరమైన ఇసుకను రాజమండ్రి నుంచి తీసుకొస్తుండగా, తరలిస్తూ కొలపర్తి, పెద్దగడ్డ మధ్యలో కాఫీ తోట వద్ద టిప్పర్ రోడ్డు ప్రమాదానికి గురైంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన ఈ టిప్పర్ లారీ ఇసుక లోడు వేసుకుని చింతపల్లి వైపు వస్తుండగా, ఎదురుగా అధిక వేగంతో వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి జాతీయ రహదారి రక్షణ గోడను బలంగా ఢీకొట్టింది. దీంతో లారీ ముందు భాగం దెబ్బతిన్నప్పటికీ, డ్రైవర్ సహా అందరూ సురక్షితంగా బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదంలో రహదారి రక్షణ గోడ శిథిలమైంది.

విజేత ట్రోఫీతో హనుమాన్ టీం

క్రికెట్ టోర్నీ విజేత హనుమాన్ జిమ్ టీం

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నెల రోజుల పాటు ఉత్సాహంగా సాగిన అంతర్రాష్ట్ర యూనిటీ చింతపల్లి సీజన్3 క్రికెట్ కప్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. మొత్తం 65 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో హనుమాన్ జిమ్ టీమ్ ఫైనల్ మ్యాచ్‌లో సిసిసి జట్టును ఓడించి కప్‌ను కైవసం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో ప్రదర్శనతో ఆకట్టుకున్న హనుమాన్ జిమ్ టీమ్ కెప్టెన్ పి.లోవరాజు విజేతల ట్రోఫీతో పాటు రూ. 75వేల నగదు బహుమతిని అందుకున్నారు. రెండో స్థానంలో నిలిచిన సిసిసి జట్టు కెప్టెన్ డి.చినబాబు ట్రోఫీతో పాటు రూ. 35వేల నగదు బహుమతి అందుకున్నారు.

ముగింపు వేడుకల్లో నిర్వాహకులు దొండ చినబాబు, మండి భూషణం, గోవింద్, లోకేష్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. క్రీడల ద్వారా యువతలో అనుకరణీయమైన ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, ఇలాంటి టోర్నమెంట్లు వారిలో నైపుణ్యాలను వెలికితీయడంలో కీలక పాత్ర వహిస్తాయని వారు అభిప్రాయపడ్డారు. విజేత జట్టుకు అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని రాష్ట్ర స్థాయి టోర్నీలు నిర్వహించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని నిర్వాహకులు తెలిపారు.

రింతాడలో జనసేన కోర్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- జికె.వీధి : మండలంలోని రింతాడ పంచాయితీ జనసేన కోర్ కమిటీని నియమించారు. అధ్యక్షులుగా కోయం ఇమాన్యుల్ (సిద్దు), ఉపాధ్యక్షులుగా మాచర్ల అనిల్,పాంగి గిరిబాబు,ఎం రాములు,కార్యదర్శి గబులంగి గణేష్,గేమ్మిల వినీత్ కోశాధికారి సాగిన బ్రహ్మాజీ, యూత్ అధ్యక్షులు కోర్ర రాజబాబు,మహిళా విభాగం అధ్యక్షులు సోమేల చిన్నములు తదితరులు ఈ కమిటీలు ఎన్నుకున్నారు. గూడెం కొత్త వీధి జనసేన మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు,గొర్ల వీర వెంకట మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమయేందుకే ఈ పంచాయతీ కోర్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు.

ఆసుపత్రి పరిశీలనలో ఎంపిపి కారం లక్ష్మి, తదితరులు

మందులు సిద్ధంగా ఉంచాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ రోగాలకు ముందుస్తుగా మందులు సిద్ధం చేసి ఉంచాలని ఎంపిపి కారం లక్ష్మి సూచించారు. మండలంలోని రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఎంపీపీ, సిపిఎం నాయకులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి, సిబ్బందితో మాట్లాడారు. గోదావరి వరదల సమయం సమీపిస్తున్న కారణంగా అన్ని రకాల రక్తపరీక్షలు సంబంధిత సామాగ్రి అందుబాటులో ఉండేటట్లు చూడాలన్నారు. రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, చినమట్టపల్లి ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, మండల కమిటీ సభ్యులుమ పోడియం శ్రీరామమూర్తి, కారం సుందరయ్య, వడ్లాది రమేష్, కమ్మిచిచ్చు సత్యనారాయణ, పీసా కమిటీ ఉపాధ్యక్షులు సారా పాండురాజు, పీసా కార్యదర్శి వేటగాని సూరి తదితరులు పాల్గొన్నారు.

21 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - కూనవరం : మండలంలోని పోలిపాక గ్రామ శివారులో 21 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ లతాశ్రీ, సిబ్బంది వాహనాలు తనిఖీలు చేపట్టారు. అటుగా వచ్చిన ఏపి 40 ఏఎఫ్ 4943 నెంబర్ గల సుజుకి యాక్సెస్ వాహనాన్ని తనిఖీ చేయగా సుమారు 21 కేజీల గంజాయి పట్టుబడింది. దాని విలువ 1 లక్ష 5వేల రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు. గంజాయి విక్రయించిన ఒరిస్సా బోర్డర్ వ్యక్తి పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-దేవీపట్నం : దేవీపట్నం మండల ఇందుకూరుపేట వ్యవసాయ కార్యాలయం వద్ద సబ్సిడీపై ప్రభుత్వం మంజూరు చేసిన వరి విత్తనాలను మండల వ్యవసాయ అధికారిణి ప్రశాంతి ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నాయకులు సోమవారం ఉదయం పంపిణీ చేశారు. విత్తనాల కోసం రైతుల ఆధార్, రేషన్, పట్టాదార్ పాస్ బుక్, జెరాక్స్‌లు, ఫోన్ నెంబర్ తీసుకుని వ్యవసాయ కార్యాలయానికి వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ రికార్డు సాధనే లక్ష్యం

21న విశాఖలో 5 లక్షలు.. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది యోగాసనాలు
క్షేత్ర స్థాయి సమీక్షా సమావేశంలో సిఎం చంద్రబాబు
నగరంలో ఏర్పాట్లను నిశితంగా పరిశీలన

ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాట్లును పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 21న విశాఖలో తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ప్రపంచ రికార్డు సాధనే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనే ఈ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు సోమవారం విశాఖ వచ్చిన చంద్రబాబు ఆర్‌కె బీచ్ నుంచి రుషికొండ సమీపంలోని గీతం యూనివర్సిటీ వరకూ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్ మైదానంలో చేసిన ఏర్పాట్లనూ పరిశీలించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ యోగా డే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఏ విధంగా చేస్తున్నారనే అంశంపై అధికారుల నుంచి సమాచారం తీసుకున్నారు. యోగా డేను ప్రపంచ రికార్డు సాధించేలా నిర్వహించేందుకు అవసరమైన అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

యోగా డే డిక్లరేషన్ చేద్దాం

యోగా డే నిర్వహణపై నిర్వహించిన అత్యున్నత స్థాయి సమీక్షలో సిఎం మాట్లాడుతూ.. 'ఇంటర్నేషనల్ యోగా డే డిక్లరేషన్‌ను విశాఖ వేదికగా చేద్దాం. యోగా నిత్య జీవితంలో భాగంగా మారేలా కృషి చేద్దాం. విశాఖలో చారిత్రక వేడుకకు నాంది పలుకుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది వరకు యోగా డేలో పాల్గొంటారని అంచనా వేస్తున్నాం. 5 లక్షల మందితో యోగా చేయడానికి విశాఖ వేదికకానుంది' అని చెప్పుకొచ్చారు. ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు యోగా డే నిర్వహణకు అనువైన ప్రాంతమన్నారు. దేశంలో ఇలాంటి ప్రదేశం మరెక్కడా లేదన్నారు. యోగా డే నిర్వహణకు సంబంధించి భారతీయ నౌకాదళం కూడా 11 నౌకలను ఆర్కే బీచ్ సమీపంలో ప్రదర్శించనుందని వెల్లడించారు. ప్రజా ఉద్యమంగా యోగాను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు యోగా అవసరమన్నారు. 326 కంపార్టమెంట్లల్లో యోగాసనాలు వేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు.

రోజంతా విస్తృత పర్యటన

సోమవారం విశాఖకు చేరుకున్న చంద్రబాబు అంతర్జాతీయ యోగా డే నిర్వహించే వేదికైన ఆర్‌కె బీచ్‌లో తొలుత ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. వేదిక వద్ద చేయాల్సిన పనులపై పలు సూచనలు చేశారు. ఆ తర్వాత ఆర్కే బీచ్ నుంచి రుషికొండ సమీపంలోని గీతం యూనివర్సిటీ వరకూ బీచ్ రోడ్డులో ప్రయాణించి పరిశీలన చేశారు. అటు ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో చేసిన ఏర్పాట్లను కూడా సిఎం సమీక్షించారు. విశాఖ ఆర్కే బీచ్ వేదికగా ఐదు లక్షల మంది యోగా డేలో హాజరయ్యేలా చేస్తున్న ఏర్పాట్లను ముఖ్యమంత్రి స్వయంగా సమీక్షించారు. యోగా డే కోసం చేసిన ఏర్పాట్లను, ప్రధాని పర్యటనకు సంబంధించిన అంశాలను యోగాంధ్ర - 2025 నోడల్ అధికారి ఎమ్‌టి.కృష్ణబాబు సిఎంకు వివరించారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకూ బీచ్ రోడ్ వెంబడి వివిధ ప్రాంతాల్లో చేసిన ఏర్పాట్లను విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వివరించారు. అంతర్జాతీయ యోగా డేలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చూసుకోవాలని సిఎం సూచించారు. సిఎం వెంట స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు నారా లోకేష్, నారాయణ, కందుల దుర్గేష్, డోలా బాల వీరాంజనేయ స్వామి, పార్థసారథి, అనిత, గుమ్మడి సంధ్యారాణి, తదితరులు ఉన్నారు.

విశాఖ పోర్టుకు రెండు ప్రతిష్టాత్మక అవార్డులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీకి ఢిల్లీలో జరిగిన 11వ వార్షిక గ్రీన్‌టెక్ సిఎస్ఆర్ అవార్డ్స్ - 2025 కార్యక్రమంలో రెండు ప్రతిష్టాత్మక అవార్డులు దక్కాయి. ఈ విషయాన్ని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి విభాగాలలో విశాఖపట్నం పోర్టు అథారిటీ చేపట్టిన విశిష్టమైన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. గ్రీన్‌టెక్ ఫౌండేషన్ ప్రతి సంవత్సరం పది విభాగాల్లో అత్యుత్తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలకు ఈ అవార్డులు ప్రదానం చేస్తోంది. ఆధునికమైన, సమర్థవంతమైన సామాజిక అభివృద్ధికి పోర్టు సిఎస్ఆర్ కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఆదివాసీ, సామాజికంగా వెనుకబడిన తరగతుల కోసం చేపట్టిన కార్యక్రమాలు ప్రత్యేకంగా నిలిచాయి. ఆరోగ్య సంరక్షణ ప్రోత్సాహంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలకు ఆర్థిక సహాయం అందించడం, లయన్స్ కేన్సర్ అండ్ జనరల్ హాస్పిటల్‌లో పర్యావరణ నిర్వహణ సదుపాయాల కల్పనకు చేయూతనివ్వడం, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మిడ్డే మీల్స్ నిధులు అందించడం వంటి చర్యలు చేపట్టింది. నైపుణ్యాభివృద్ధి విభాగంలో స్థానిక యువతకు సహాయపడింది. మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగాల కోసం శిక్షణ కార్యక్రమాలు చేపట్టింది. ఇవన్నీ గ్రీన్ టెక్ అవార్డుల్లో విశాఖపట్నం పోర్టును విజేతగా నిలిపాయి. ఈ విజయం పట్ల పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సంతోషం వ్యక్తం చేశారు. విజయానికి కారకులైన ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు. సామాజికపరంగా సమగ్రాభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

సర్టిఫికెట్లను చూపుతున్న విద్యార్థులు

ముగిసిన కంప్యూటర్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు సచివాలయంలో నిర్వహించిన వేసవి కంప్యూటర్ శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. స్థానిక ఆర్‌బికెలో ఏర్పాటు చేశారని ముగింపు కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాంగి దుర్జో, మన్యం కవి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ అధ్యాపకులు నూనె రమేష్ కంప్యూటర్, ఇతర ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూనె రమేష్ మాట్లాడుతూ ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో సీలేరులో కంప్యూటర్ కోర్స్ నేర్పించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీకి అనుగుణంగా కంప్యూటర్ శిక్షణ విద్యార్థులకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. నిరంతరం సాధన చేస్తూ కంప్యూటర్‌పై పరిజ్ఞానాన్ని పెంచుకొని పట్టు సాధించాలని సూచించారు. శిక్షణా శిబిరాన్ని నిర్వహించడానికి సహకారం అందించిన సర్పంచ్ దుర్జోకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, ఉప సర్పంచ్ వల్లి ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్ అర్జీలకు సత్వరమే పరిష్కారం

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్)కు వచ్చే అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, ఏపీఓ జనరల్ డిఎన్వి రమణ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తం 71 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ మాట్లాడుతూ వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించి దరఖాస్తుదారుల అర్హతలను బట్టి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

బదిలీలు, ప్రమోషన్ల పేరుతో ఏజెన్సీలోకి మైదాన ప్రాంత ఉద్యోగుల ప్రవేశం

ప్రజాశక్తి-విఆర్.పురం : బదిలీలు, ప్రమోషన్ల పేరుతో ఏజెన్సీలోకి మైదాన ప్రాంత ఉద్యోగులకు ప్రవేశం కల్పిస్తున్నారని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బదిలీలు, పదోన్నతులలో ఏజెన్సీ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు అంటూ ఏజెన్సీ ప్రాంతంలో మైదాన ప్రాంత ఉద్యోగులను పంపించే ప్రయత్నం జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రతి ఉద్యోగి గమనించి తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. మైదాన ప్రాంత ఉద్యోగులు ఏజెన్సీకి వస్తే ఏజెన్సీ ఉద్యోగులు మైదాన ప్రాంతాలకు పోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఏజెన్సీ వ్యాప్తంగా చాలా చోట్ల మైదాన ప్రాంత ఉద్యోగులకు జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చారన్నారు. ఇప్పటికైనా ఏజెన్సీ ఉద్యోగులందరూ హక్కుల కోసం, రిజర్వేషన్ కోసం పోరాటం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

జివిఎంసి కమిషనర్‌గా కేతన్ గార్గ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) నూతన కమిషనర్‌గా 2018 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన కేతన్ గార్గ్‌ను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కేతన్ గార్గ్ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.